# నర్తనశాల (అను)

## బామ్మర్దిగారి 'అంతిమ యాత్ర'

*"నిన్నటిదాకా అసలు నెగ్గుతావా, నెగ్గవా అనేదే డౌటు కాని, ఈ ఎదవ తన్నులు తినొచ్చాక..." హాస్పిటల్లో ఎమర్జెన్సీ వార్డులో పైకీ, కిందకూ ఉయ్యాల లూగుతున్న బామ్మర్ది గురించి ఈసడింపుగా అని - "ఇప్పుడు డిపాజిట్టు గురించి బెంగట్టుకుంది అప్పాజీ!" అన్నారు కోటయ్య మంత్రిగారు తల కొట్టుకుంటూ.*

హాలులో నిశ్శబ్దంగా సంతాపసభలో కూర్చున్నట్లు, కూర్చున్న ఆంతరంగికులంతా బామ్మర్దిగారు తన్నులు తిన్నందుకో, కోటయ్యగారి డిపాజిట్టు ఊడేలా ఉన్నందుకో, ఎందుకో కాని ఓసారి ఉస్సుమని నిట్టూర్చారు.

కోటయ్యగారి మీద పోటీకి దిగిన డాక్టరు రావు ఏదో మంచి చెయ్యాలన్న తపనతో నిలబడ్డారు కాని, ఆయనకి రాజకీయాల్లో ప్రవేశం లేదు. ఏ పార్టీకి చెందిన వాడూ కాదు. ఆయనకి ప్రజల్లో డాక్టరుగా మంచి పేరుంది. ముక్కుకి సూటిగా పోయే వాడవడంవల్ల ముక్కుమీద కోపం ఉంటుంది కాని, ఆయన గురించి చెడుగా అన్న వాళ్లెవరూ లేరు. అలాగే కోటయ్య మంత్రిగారి గురించి మంచిగా అనేవాళ్లూ లేరు.

"ఇప్పుడెలా వుంది?" కోటయ్యగారికి రాజకీయాల్లో గురువు, వయోవృద్ధుడు, ప్రస్తుతం సంతాపసభకి అధ్యక్షుడు అయిన అప్పాజీ, ఖద్దరు లాల్చీ జేబులోంచి లంక పుగాకు చుట్టతీసి ముట్టించి, రైలింజన్లా గుప్పుతూ అడిగాడు.

"చెప్పానుగా ! డిపాజిట్టు గురించి బెంగెట్టుకున్నానని."

"నీ డిపాజిట్టు గాదు - ఆడి కెలా వుందని అడుగుతున్నాను."

"సచ్చేలా వున్నాడు - ఒరే ఎదవా! బామ్మర్దీ ! ఎలక్షన్లయ్యేదాకా ఈ నాలుగు రోజులూ ఏ ఎదవపనీ చెయ్యకురా! తన్నులు తినకురా! మనం

నెగ్గే చాన్సు తగ్గిపోతుందిరా అని చిలక్కి చెప్పినట్లు ఆడి గెడ్డం పట్టుకుని మరీ చెప్పాను. ఇన్నాడా? ఆడపిల్ల కనిపిస్తే చాలు - ఈడికి మతి పోద్ది. ఎదవన్నరెదవ!"

"అట్టే మాట్టాడక" - అంతవరకు దుఃఖసముద్రంలో జలాంతర్గామిలాగ నిశ్శబ్దంగ ఈదుతున్న కోటయ్యగారి భార్య పైకి తేలి అంది. - "ఆడు శ్రీకృష్ణుడు లాంటోడు. అసలు మాయమ్మ ఆడికి క్రిష్ణమూర్తని పేరెడదావనుకుంది, కాని ఈడు పుట్టిన టయానికి మా తాత సచ్చిపోతే, మా తాత పేరెట్టాలని మా బామ్మ పట్టడితే ఈడికి పిచ్చయ్యని పేరెట్టారు," అని చరిత్ర చెప్పుకొచ్చి,

"ఆ పేరే కనుకెడితే దానెనకాలా దీనెనకాలా మావోడు పడ్డంకాదు - మావోడెనకాలే పదారు వేలమంది పడెవోరు..." అంది ముక్కు చీదుతూ.

"ఆ పేరెట్టేయాల్సింది - ఆడిలాగే ఈడూ గోదారొడ్డున గేదెలు మేపుకుంటూ సిట్టారంలో పడుండేవాడు నా పీకలమీద కూసోకుండా..."

"ఆడు గేదెలు మేపలేదు, ఆవులు మేపేవాడు."

"ఈణ్ణి ఆవులు కూడా మేపమను - గొర్రెలు, మేకలు, పందులు కూడా మేపమను - నా కభ్యంతరం లేదు," ఉదారంగా అని మళ్లీ డిపాజిట్టు గుర్తుకొచ్చి - "ఎదవన్నరెదవ! నా బతుకులో లైటార్పి సీకటి చేసేశాడు" అని కళ్లనీళ్లెట్టుకున్నాడు కోటయ్యగారు.

పడక కుర్చీలో ముసలి పిల్లిలా కళ్లు మూసుకుని చుట్ట గుప్పుతూ, పండిన గడ్డం చేత్తో నిమురుకుంటూ భార్యాభర్తల సంవాదం వింటున్న అప్పాజీ లేచి కూర్చుని - "సీకట్లో ఎలుగు చూసేవోడే పొలిటీషియను కోటయ్యా!" అన్నాడు కోటయ్యగారితో.

"సీకట్లో ఎలుగు ఎవరికి కనిపిస్తది - పిల్లికి తప్ప!"

"ఆడు గోడమీద పిల్లి లాంటోడు కాబట్టి ఆడికి కూడా కనిపిస్తది కాని, అసలేం జరిగిందంటా?" అనడిగాడు అప్పాజీ.

☆ ☆ ☆

నాలుగు రోజుల క్రితం సాయంసమయంలో కాలవ ఒడ్డున కిళ్లీకొట్టు దగ్గర నిలబడి బీటు కొడుతున్న బామ్మర్ది కంట్లో వంతెన మీంచి

వెడుతున్న ఆ పిల్ల నలుసులా పడింది. ఆ పిల్ల నల్లగా ఉన్నా మంచి వయసులో ఉంది. అందంగా లేకపోయినా సెక్సీగా ఉంది. బామ్మర్ది కళ్లు నులుముకుని రెండోసారి చూడగానే ఆ పిల్లకళ్లలోంచి గుండెలోకి దిగిపోయింది.

ప్లాట్ ఫాంమీంచి కదిలీ కదలకుండానే స్పీడందుకునే ఎలక్ట్రిక్ రైలింజనులాంటివాడు బామ్మర్ది. అందుచేత వెంటనే తిన్నగా వెళ్లిపోయి ఎటాకిచ్చేశాడు.

"నా పేరు పిచ్చయ్య" అన్నాడు, ఆ పిల్లకి అడ్డుపడి తన్ను తాను పరిచయం చేసుకుంటూ

"చెప్పక్కర్లేదు, చూస్తేనే తెలుస్తోంది," అంది ఆ పిల్ల గడుసుగా.

ఆ పిల్ల లోకజ్ఞానం లేనిదేవీ కాదు. చదివింది మూడో క్లాసు వరకైనా వారానికి ఏదు సినిమాలు చూస్తే వచ్చే తెలివితేటలున్నాయి ఆ పిల్లకి. సినిమా స్టారులా డ్రెస్సు చేసుకుని, సినిమా డైలాగులు పలుకుతుంటుంది. ఆ పిల్ల కావాలంటే ఆ సంభాషణ పొడిగించకుండా అక్కడే తుంచి వెళ్లిపోగలదు. కానీ అప్పుడే 'ఆడదెబ్బ' మాట్నీ చూసి ఇంటికి తిరిగి వెడుతోంది. ఆ సినిమాలో విలను హీరోయిన్ని దారిలో అలా ఎటాకిస్తే ఇలా సమాధానం చెబుతుంది. ఈ పిల్ల కూడా నడుంమీద చేతులెట్టుకుని కళ్లు పెద్దవి చేసి అలాగే అంది.

ఆ పిల్ల అలా అనగానే అది సరసంగా భావించి రెండో అడుగు వేశాడు బామ్మర్ది.

"ఇక్కడ మంచి నీళ్లున్నాయా?" నిండుగా ప్రవహిస్తున్న కాలవ వంతెనమీద నిలబడి అడిగాడు.

"లేవు" అంది హీరోయిన్.

"సాలా దాహంగా వుంది" అన్నాడు విలను.

"సోడా తాగు."

"సోడా నా ఒంటికి పడదు."

"మరేం పడతది?"

"పాలు... పోనీ పాలేవైనా దొరుకుతాయా?" అన్నాడు విలను శ్లేషగా, ఆ పిల్ల ఎత్తు గుండెల కేసి చూస్తూ.

కథ చాలా దూరం వెళ్లేట్టుందని ఆ పిల్లకు అప్పుడు కొంచెం తెలివొచ్చి, హీరోయిన్ అవతారం చాలించి వెళ్లిపోయింది. కాని బామ్మర్ది విలన్ అవతారం వదల్లేదు.

రెండో రోజు మరో సినిమా చూసి వస్తుండగా అదే సమయంలో మళ్లీ ఎటాకిచ్చాడు సూటిగా. వంద రూపాయల నోటు మీద "ఎక్కడ?" అని రాసి ఆ పిల్లచేతిలో పెట్టి ఓ చిరునవ్వు విసిరాడు.

ఆ పిల్ల నోటు చూసింది. నోటుమీద రాసింది కూడబలుక్కుని చదివింది. మాట్లాడకుండా నోటు జాగ్రత్తగా నాలుగు మడతలు పెట్టి కుడిచేతి పిడికిలిలో బిగించి వెళ్లిపోయింది. బామ్మర్ది కథ రంజుగా నడుస్తున్నందుకు సంతోషించి మళ్ళి కిళ్లీకొట్టు దగ్గరికి చేరాడు.

ఆ పిల్ల అటూ ఇటూ చూడకుండా, పిడికిలి విప్పకుండా తిన్నగా 'హనుమాన్ వ్యాయామ కళాశాల - ప్రిన్సిపాల్ భజగోవిందం' అనే బోర్డున్న ఓ ఇంటి దగ్గరకు వెళ్లింది. ఆ బోర్డు పక్కనే "చిరంజీవి అభిమాన సంఘం - ప్రెసిడెంటు: గోవింద్" అని ఇంకో బోర్డుంది. దాని కింద ఎర్ర రంగుతో గోడమీద 'ఇక్కడ జూడో, కరాటే, కుంగ్‌ఫూ, మల్లవిద్యలు నేర్పబడును' అని తాటికాయంత అక్షరాలతో రాసి వుంది.

ఆ పిల్ల గేటు తీసుకుని తిన్నగా వెళ్లి, స్పెషల్ జీవన్‌టోన్ సీసాలు పూటకు రెండు లాగిస్తున్న వాడిలా మూడడుగుల ఛాతీతో ఉన్న ఓ పాతికేళ్ల వ్యక్తి ఎదురుగా నిలబడి - "బావా!" అంది.

"ఏంటి?" అన్నాడు భజగోవిందం తల తిప్పకుండా, మరదలు వెళ్లిన సమయంలో మనసంతా కేంద్రీకరించి మూడు ఇటికల్ని అరచేత్తో ఒకేసారి పగలగొట్టాలని ప్రయత్నిస్తున్నాడు భజగోవిందం.

మరదలు డ్రమెటిక్‌గా (ఆడదెబ్బలో హీరోయిన్లా) మెల్లగా పిడికిలి విప్పి వందరూపాయల నోటు చూపించి, కథంతా వివరించింది.

భజగోవిందం సింహబలుడు కాదని అతని శత్రువులు కూడా అనలేరు. అలాగే అతని ఐ.క్యూ. పది దాటదనే వాస్తవాన్ని అతని ప్రాణస్నేహితులు కూడా కాదనలేరు.

"వాడితో నువ్వు మాటలెందుకు పెంచావు? నోటెందుకు తీసుకున్నావు? అప్పుడే లాగి లెంపకాయ కొట్టి ఎందుకు రాలేదు?" అని మరదల్ని మందలించలేదు భజగోవిందం, అసలు అలా మందలించాలని కూడా

తట్టలేదు అతనికి.

కథ వింటూనే అతని చెయ్యి పంద పౌనుల సుత్తిలా పైకి లేచి మూడు ఇటుకల్ని ఒకేసారి ముక్కలు చేసి రికార్డు బ్రేక్ చేసింది.

"ఎపుడాడు?" అన్నాడు భజగోవిందం ఇటిక ముక్కలకేసి సంతృప్తిగా చూస్తూ.

"రౌడీస్ ఎదవ" అంది మరదలు.

"ఆడేం జేస్తాడు?"

"ఎదవేం జేస్తాడు? ఎదవపన్లు చేస్తాడు."

"నన్నేం చెయ్యమంటావ్?"

"ఆదు ఇలనైతే నువ్వు ఈరోవి. ఈరో ఏం చేస్తాడో అదే చెయ్యాలి".

భజగోవిందం ఆడదెబ్బ సినిమా చూళ్లేదు కాని దేశాలమ్మ జాతరలో నర్తనశాల సినిమా - ఆర్గనైజర్ని బతిమాలి, బెదిరించి ముందుకు వెనక్కు నడిపిస్తూ రాత్రంతా చూస్తూనే వున్నాడు. అన్నగారికిలా మనక్కూడా ఓ కీచకుడు దొరికితే ఎంత బావుండును - అని తహ తహలాడిపోతున్న భజగోవిందం తన కోరిక తీరుస్తున్న దేవుడికి మనసులోనే నమస్కరించి, మీసాలు తిప్పి, గొర్రెలా ఓ నవ్వు నవ్వి, మరదలు కేసి తిరిగి

"ఆ సీర యిప్పేయ్" అన్నాడు.

"ఏంటి?" అంది మరదలు ఒళ్లు జలదరించి.

"ఆ సీర యిప్పి నాకిచ్చేయ్! నేను నర్తనశాలలో యంటీవోడులా ఈ సీర కట్టుకుని కాలవ్వొడ్డున రావు డాక్టరు మావిడి తోటలో కూర్చుంటా! ఆణ్ణి అక్కడకు తీసుకురా! ఆపైన ఫ్రీగా సినిమా సూద్దువుగాని..."

"పాత సింతకాయ పచ్చడి సినిమా"

"ఆడి రోగానికి పాత సింతకాయ పచ్చడే పచ్చెం," మొండిగా అన్నాడు భజగోవిందం.

"మూడిటికలు టుప్పుమని ఇరగ్గొట్టినాడివి సిరంజీవిలా స్టంటు చెయ్యాలి గాని ఆడంగోడిలా సీర కట్టుక్కూర్చుంటావా?" - నిరసనగా అంది మరదలు.

"ఏంటి? నేను ఆడంగోణ్ణా? సిరంజీవికే గాని మా యన్నకి స్టైంటు రాదా?" - భజగోవిందానికి కోపం వచ్చేసింది క్షణంలో. మరదలు మీద ప్రేమతో 'గోవింద్' గా పేరు మార్చుకుని చిరంజీవి అభిమాన సంఘానికి ప్రెసిడెంటుగా ఉంటున్నాడే కాని తారకరాముడికి నమ్మినబంటు అతను.

"మా యన్న కత్తి తీసుకుని తెరమీద నిలబడ్డ ముప్పయ్యేళ్లూ ఆడి కెదురు లేదు - తెలుసా? గుడ్డొచ్చి పిల్ల నెక్కిరించిందట ! ప్రెసిడెంటు రిజైను యండ్ పెళ్లి కేన్సిలు" అని మరదలు అన్నగార్ని అవమానించినందుకు నిరసనగా చి.అ.సం. అధ్యక్షుడిగా రిజైను చేస్తున్నట్లు, తమ పెళ్లి కేన్సిలయినట్లు ప్రకటించాడు భజగోవిందం.

"అదికాదు," మరదలు నాలిక కరుచుకుని క్షమాపణ చెబుతున్నట్లుగా అంది - "నేను బావగార్ని ఏవన్లే."

"బావగారెవరు?" మరదలు పిల్ల ఏకైక బావగారు ఉలిక్కిపడి అడిగారు.

"మీ యన్న."

"మా యన్న నీకు బావెల్లా అవుతాడు?"

"మరే వవుతాడు?"

"ఆడు దేశానికి అన్న! ఆణ్ణి అన్న అనాలి."

"ఛ... ఛ.. నీ యన్న నా అన్నవుతే మన పెళ్లెలా అవుద్ది?" అంది మరదలు.

భజగోవిందం బుర్ర గోక్కుని - "ఆణ్ణి బావని మాత్రం అనొద్దు," అన్నాడు.

మగ దేశానికి అన్న అయినవాడు ఆడ దేశానికి బావ కాకుండా ఏవవుతాడో అర్థం కాక - "బావని బావ గాక మరేవనాలి బావా?" అంది మరదలు.

ఏవనాలి అని కాసేపు ఆలోచించి బుర్ర హీటెక్కిపోయి, ఆలోచన ఆపుచేసి - "వొరసలెట్టి పిలవొద్దు. యంటీవోడను - సాలు" అని రాజీకొచ్చి - "ఆ సంగతి నా కొదిలేసి నువ్వు ఆడదెబ్బ సినిమా మూడోసారి సూసిరా" అన్నాడు భజగోవిందం.

మర్నాడు సాయంకాలం పంతెనమీంచి వెడుతూ కిళ్లీకొట్టు దగ్గరున్న బామ్మర్దిని ఓరకంట చూసింది మరదలు. బావా మరదళ్లు కథ, స్క్రీన్ ప్లే,

దర్శకత్వం, ముఖ్య పాత్రలు నిర్వహిస్తున్న సినిమాలో తన పాత్ర తెలియని బామ్మర్ది జిల్లయిపోయి, పదిలిన బాణంలా కిళ్లీకొట్టు దగ్గర మాయమై పంతెనమీద ప్రత్యక్షమయ్యాడు. మరదలు బామ్మర్ది చేతిలో వంద రూపాయల నోటుంచి అరచేయి గిల్లి వెళ్లిపోయింది. బామ్మర్ది ఆతృతగా నోటుకేసి చూశాడు. తన ప్రశ్న కింద సమాధానం ఉంది. "ఈ రాత్రి పదకొండు గంటలకి - కాల వ్వొద్దున రావు డాక్టరు మావిడితోటలో..."

బామ్మర్ది ఆనందం పట్టలేక పిచ్చి గంతులేశాడు. అతనికి పంతెనమీంచి కాలవలోకి దూకెయ్యాలనిపించింది. కాని ఈత రాదని ఆ ప్రయత్నం విరమించుకుని, క్షణమొక యుగంలా రాత్రి పదింటిదాకా గడిపాడు.

ఆ తరువాత యుడికులోన్ నీళ్లలో స్నానం చేసి, అద్దం ముందు నిలబడి, పొగచూరిన పంటింటి గోడకి వెల్ల వేసినట్లు నల్లటి శరీరం మీద పౌడరు చల్లుకుంటూ - "ఒరే పిచ్చీ! ఏం పెర్సనాలిటీరా నీది ! ఇంకొంచెం పొడుగూ, ఇంకొంచెం సన్నం, ఇంకొంచెం తెలుపూ, ఇంకొంచెం కనుముక్కుతీరూ అంతా బావుంటే సినిమా ఈరోయిన్లంతా నీ ఎనకాలే పడేవోళ్లు గదరా," అని తన పెర్సనాలిటీకి తనే మురిసిపోయాడు.

మరదలు పిల్ల ముద్దుగా అందించిన వంద రూపాయల నోటు ముద్దు పెట్టుకుని, జ్ఞాపక చిహ్నంగా జాగ్రత్తగా డ్రెస్సింగ్ టేబుల్లో దాచి, మల్లెపువ్వులాంటి బట్టలు వేసుకుని, సెంట్లూ, అత్తర్లూ చల్లుకుని ఘుమ ఘుమ లాడుతూ బయలుదేరాడు బామ్మర్ది.

రావు డాక్టరు మావిడితోటలో ప్రవేశిస్తూనే బామ్మర్ది గుండె డొక్కు ఆర్టీసీ బస్సు ఇంజన్లా ధడక్కు ధడక్కు మని పెద్ద చప్పుడు చేస్తూ లయతప్పి కొట్టుకోడం మొదలుపెట్టింది. రెండడుగులు వేశాడో, లేదో మావిడిచెట్టు కింద, వెన్నెల నీడలో చీర కట్టుకున్న 'చిన్నది' కనుపించి బామ్మర్దిగారి ఒళ్లంతా అదోలా అయిపోయింది.

"ఊ.." అంటూ ఓసారి ఒళ్లు విరుచుకుని, ఛాతీ పొంగించి, 'సిలకపచ్చనీ సీరలోన, సిగురుమెత్తని పదుసుదనం' అని కూనిరాగం తీస్తూ వెనుకనుంచి వెళ్లి గట్టిగా వాటేసుకున్న బామ్మర్దిగారికి చిగురుమెత్తని పదుచుదనం తగల్లేదు. ఇనప స్తంభంలాంటి శరీరం తగిలి షాక్ కొట్టినట్లయి - "ఏంట్రా ఇది - ఆడదా? గాద్రెజు బీరువానా?" అని ఆశ్చర్యపోతూ చేతులు వెనక్కు తీసేశాడు.

బామ్మర్ది ఉలిక్కిపడి చేతులు వెనక్కి తీసెయ్యగానే గాద్రెజు బీరువా

మీసాలు దువ్వుతూ వెనక్కి తిరిగి ఓసారి గాండ్రించి, టక్కున ఆయన్ని పట్టుకుంది.

"మళ్లీ మనం ఆస్పత్రిలో పడిపోయాంరా," అనుకుంటూ బామ్మర్ది కాళ్లూ, చేతులూ ఆడక ఉన్నచోటే రాయిలా నిలబడిపోయాడు.

మరదలు రెండో ఆట చూసి తిరిగి వచ్చేటప్పటికి భజగోవిందం బామ్మర్దికి తన విద్యలన్నీ ప్రదర్శించటం పూర్తయి ఆఖరు సీను జరుగుతోంది.

"ఇక సచ్చిపోతాడేమో! వదిలేయ్," అంది మరదలు భయపడుతూ.

"దాహం, దాహం ! నీళ్లు, నీళ్లు!" అని మూలిగాడు బామ్మర్ది.

"ఆడికి నీళ్లు కావాలంట," అంది మరదలు.

"ఆడికి నీళ్లు పడవు కదా! పాలు ... పాలు కావాలా?" అనడిగాడు భజగోవిందం, ఏనుగు కాళ్లక్రింద తొక్కిపడేసినట్లు బామ్మర్దిని కుమ్మేస్తూ. 'వద్దు' అన్నట్లు తల కొంచెం ఊగించాడు బామ్మర్ది. ఇక మాట్లాడ్డానికి ఓపిక కూడా లేదు ఆయనకి.

"ఆడికి నీళ్లే కావాలంట," అంది మరదలు కాలవకేసి చూపిస్తూ. భజగోవిందం బామ్మర్దిని లేవదీసి, నిలబెట్టి మెడకింద ఓ చెయ్యి, నడుం కింద ఓ చెయ్యి వేసి గాలిలోకి లేపి గిరగిరా తిప్పి కాలవలోకి విసిరేశాడు.

"బాబోయ్ (బుడుంగ్)... ఈత (బుడుంగ్).. రాదు (బుడుంగ్)" అని నీళ్లు తాగుతూ గోలపెడుతున్న బామ్మర్దిని అతని కర్మకు కాలవలోనే వదిలేసి, బావా మరదళ్లు చెట్టాపట్టాలేసుకుని హాయిగా పాడుకుంటూ, మావిడితోటలోంచీ, కథలోంచీ వెళ్లిపోయి వెన్నెల్లో కలిసిపోయారు.

బామ్మర్ది కాళ్లు అందినప్పుడు నేల తన్ని పైకి తేలుతూ, అందనపుడు బుడుంగు బుడుంగు అంటూ ఏలాగోలా ఒడ్డుకి చేరి స్పృహ తప్పి పడిపోయాడు. నిన్నటినుంచి ఆయనకి స్పృహ లేదు.

* * *

"ఆణ్ణి తన్నినోళ్లెవరో తెల్సిందా?" కథంతా విని అప్పాజీ అడిగాడు.

"తెలిస్తే ఈపాటికి మడ్డరు చేయించేవాణ్ణి" - ఆవేశంగా అన్నారు కోటయ్యగారు.

"తప్పు! ఆవేశం వద్దు" అన్నట్లు కోటయ్యగారికేసి చూస్తూ -

"మద్దరు చేయిస్తే లాబవేంటి? ఈడేదో ఆడదాని వ్యవహారంలో తన్నులు తిన్నాడని ఊరంతా గుప్పుమంది కదా! నువ్వు ఈణ్ణి తన్నినోణ్ణి తన్నిస్తే నీలివార్త నిజమై కూచుంటుంది," అని మందలించి, నెత్తిమీంచి ఖద్దరు టోపీ తీసి దుమ్ము దులిపి మళ్లీ నెత్తిమీద పెట్టుకుని - "నేను అహింసావోదిని కోటయ్యా! లాబం లేకుండా మద్దరుకి నేనొప్పుకోను. ఇప్పుడు నష్టవే కాని లాబం లేదు. అంచేత ఈణ్ణి తన్నినోళ్ల సంగతలా ఉంచి ఈడు తన్నులు తినడంవలన మనకేదేనా లాబం వుందా అని ఆలోచించాలి," అని సలహా ఇచ్చాడు అప్పాజీ.

"లాబవేంటి? జనాలంతా ఇల్లాం ఎదవలు రాజ్జెవేలితే దేసెం నాశనం గాక ఏవవుద్ది అని మన డిపాజిట్టు ఊడగొట్టాలని మహాపట్టుదలతో వుంటే."

పడకకుర్చీలో పడుకుని చుట్ట కాలుస్తున్న అప్పాజీ ఉక్కిరిబిక్కిరై దగ్గుతెరల్లోకి వెళ్లిపోయాడు.

"ఏంటి, ఆరోగ్యం బాగాలేదా?" అడిగారు కోటయ్యగారు ఆత్రతగా.

"ఆరోగ్యం బాగానే వుంది. నువ్వు జనాల గురించంటే నవ్వొచ్చి, పొగ లోపలికి పోయి దగ్గొచ్చింది - అంతే," అని చుట్ట ఆర్పేసి, కళ్లు తుడుచుకుని, ఓ గ్లాసుడు మంచినీళ్లు తాగి మొదలెట్టాడు అప్పాజీ.

"పూర్వకాలంలో అదేదో దేసెంలో సీజరని ఓ రాజుగా రుండేవోడంట. ఆణ్ణి ఆడి మనుసులే నిండు రాజసబలోనే సంపేశారంట. దానిమీద జనాలకి పిచ్చెక్కిపోయి రాజుగార్ని సంపినోళ్లందర్నీ ఈళ్లూ సంపేడం మొదలెట్టారు. ఆళ్లు అలా రోడ్ల మీద తిరుగుతూ ఓ పిలక కవిగార్ని పట్టుకున్నారు. ఆ కవిగారి పేరు, సంపడానికి కుట్ర జేసినోళ్లలో ఓడి పేరు ఒకటేనంట.

"ఆ కవిగారు - 'ఆడి పేరూ నా పేరు ఒకటే కాని ఆడు నాకు సుట్టం కాదు, పక్కం కాదు, నేను పజ్జాలు రాసుకునే కవిగాణ్ణి. నన్నొదిలేండి బాబూ," అని ఆళ్లని బతిమాలుకున్నాడంట.

"ఆళ్లు ఆణ్ణి వదిలేసారా? లేదు - 'ఆడి పేరు నువ్వెట్టుకున్నావు కాబట్టి నిన్ను సంపెయ్యాలి' అని పాపం, పాటలు రాసుకునే కవిగార్ని సంపేశారంట.

"ఇంతకీ చెప్పొచ్చే దేంటంటే - జనాలు అప్పటికీ ఇప్పటికీ ఏం

మారలేదు. ఆ కాలవేంటి, ఈ కాలవేంటి, ఆ దేశవేంటి, ఈ దేశవేంటి - ఏ దేశమైనా జనా లెప్పుడూ ఎర్రిమొకాలే. ఆళ్ల బుర్రల్లోకి ఏ బ్రాండు సారా ఎక్కిస్తే ఆ బ్రాండు నిషా ఎక్కేస్తుంది. అది మనం గుర్తుంచుకుని సర్కసులో కోతుల్నాడించినట్లు ఆళ్లని బయపెట్టి, బుజ్జగించి నేర్పుగా ఆడించాలి.

"మాటవరసకన్నాను కాని కోతులాట కాదులే - పులిమీద సవారీ. అవతలోడు నీ కంటే ఆట బాగా తెలుసున్నోడు, గొప్ప యాక్టరు అవుతే ఆడు పులిమీదెక్కి కూర్చుని నీ మీదకు తోలెయ్యగలడు. అది ఆంపట్టని నిన్ను తినెయ్యగలదు.

"ఈడు ఎదవపని చేసేడని ఆళ్లు మండిపడతన్నా రన్నావు గదా! ఈణ్ణే రావుడాక్టరు మడ్డరు సేయించాలని కుట్ర పన్నేడని మనం ప్రాపగాండా మొదలెడితే పోలా? ఆళ్లు పీక్కోలేక సస్తారు," అన్నాడు అప్పాజీ.

"రావు డాక్టరుకి మంచి పేరుంది. సదూకోనోళ్లు నమ్మేసినా, సదూకున్నోళ్లు ఇంతబద్ధం నమ్మొద్దూ?" సందేహం వెలిబుచ్చారు కోటయ్యగారు.

"చెప్పేతీరులో చెబితే ఎంతబద్ధమైనా నమ్మించొచ్చు. అంతబద్ధం ఇంతబద్ధం అని ఆ తూకాలేంటి - తప్పుగాదూ?" అని కోటయ్యగార్ని మందలించి మొదలెట్టాడు అప్పాజీ.

"మనకి లోకం ఎలా తెలుస్తుందంట? కళ్లు సూస్తాయి, సెవులు ఇంటాయి - ఈ రెండూ పంపే వార్తల్ని బట్టి బుర్ర ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుందంట. నువ్వు ఆళ్లేం సూడాలనుకుంటున్నావో అదే ఆళ్ల కళ్లముందరెట్టు. అదే ఆళ్ల సెవుల్లో ఊదరగొట్టు. ఇంక ఆళ్ల బుర్ర నీ కంట్రోల్లో ఉండకపోతే నన్నడుగు. తమాషా ఏంటంటే ప్రతీవోడూ అది తన ఆలోచనే అనుకుంటాడు గానీ నువ్వాడిస్తున్నట్లు ఆడికి తెలియదు.

"గవర్నమెంటేం జేస్తది? దాని కేది లాబసాటో అదే టీ.వీ.లో సూపిస్తుంది. రేడియోలో చెబుతుంది. పేపర్లో రానిస్తుంది. బామ్మడి మేక దొంగల కథ మూడో క్లాసులో సదూకున్నావు కదా! అలాగ జనాలికి తలంటేసి - ఇంగ్లీషోడు బ్రెయిను వాషంటాడే, అదన్నమాట - మ తోమేలా జేసి ఆళ్లకి మేకకీ, కుక్కకీ తేడా తెలీకుండా చేస్తది.

"అంచేత జనాల గురించి అట్టే కంగారుపడక, సెయ్యాల్సిన

కార్యక్రమం ప్లానుగా, పకడ్బందీగా చెయ్యి. నువ్వు నెగ్గాక నిజం చెప్పావా, అబద్ధం చెప్పేవా అని అడిగేవో డుండడు. ప్రతీ ఎదవా రోజుకు ఎయ్యి అబద్ధాలాడే ఈ రోజుల్లో ఎవరెన్ని అబద్ధాలాడుతున్నారో పట్టించుకోడానికి జనాలకి తీరికెక్కడ సచ్చింది? ఆళ్లకి ఏరే పన్లేదేంటి?"

"పేపరంటే గుర్తొచ్చింది - చంటబ్బాయికి అర్జెంటుగా నేను రమ్మన్నానని కబురెట్టించు" అన్నాడు అప్పాజీ.

నిజాయితీ, నిష్పక్షపాతం, నిర్భయత్వం ఆదర్శాలుగా పట్టణం నుంచి వెలువడే సంచలన పత్రిక 'కోడికూత' ఎడిటరు చంటబ్బాయి అర్జెంటుగా కబురెళ్లగానే - "ఏంటీ అప్పాజీ - పిలిపించారుట" అంటూ రెక్కలు కట్టుకువచ్చి వాలాడు.

"ఏంట్రా చంటబ్బాయి, నీ కోడేవంటోంది?" అని పరామర్శించాడు అప్పాజీ.

"కోడి కూసి ఆర్నెల్లయింది అప్పాజీ! కోర్టుల చుట్టూ తిరగడంతోనే సరిపోతోంది" అన్నాడు చంటబ్బాయి దీనంగా.

ఆర్నెల్ల క్రితం 'కోడికూత', సంపుటి 12, సంచికలు మూడు - నాలుగు - అయిదులలో 'రాజమహలు రహస్యం' అనే సంచలన వ్యాసం సీరియల్‌గా ప్రచురితమై రసిక హృదయాల నుర్రూత లూగించింది. మూడో సంచిక వచ్చేదాకా చదువుకు ఆనందిస్తున్న కంట్రాక్టరు అప్పలరాజు రసిక హృదయానికి, సీరియల్‌లో కథానాయకుడు 'రప్పలరాజు' తనే అని అప్పుడు అర్థమై - "నన్ను రప్పల రాజంటాడా - చంటబ్బాయిగాడి డొక్కచించి డోలు కట్టి వాయించి, ఆడి ఈపు చీరి ఉప్పుపాతరేసి, ఆడి కోడిని సంపి కూరొండుకు తినకపోతే నా పేరు కంట్రాక్టరప్పల్రాజు కాదు - రప్పలరాజే" అని భీషణ ప్రతిజ్ఞ చేసి ఆ ప్రయత్నం మీద మహా పట్టుదలతో మూడు నెలలు రాత్రీ పగలూ చంటబ్బాయిని వెంటాడాడు.

అప్పలరాజు శపథం చెవిన పడీ పడగానే క్షణం ఆలస్యం చెయ్యకుండా చంటబ్బాయి కోడిని గంప కిందెట్టేసి, తను అటకెక్కెయ్యకపోతే అంత పనీ జరిగేదే. పగలంతా అటకమీద గడిపి, రాత్రి మారువేషంలో రహస్యంగా తిరుగుతూ, తెల్లవారగానే అటక ఎక్కేస్తూ, అప్పలరాజు ఆవేశం కొంచెం తగ్గేదాకా మూణ్ణెల్లు గడిపాడు చంటబ్బాయి.

"చంటబ్బాయి గెడ్డికి కక్కుర్తడి ఎదవరాతలు రాశా డప్పల్రాజుగారూ!" అన్నారు మూణ్ణెల్ల తరువాత రాజీ కుదర్చడానికి అప్పలరాజుగారి దగ్గరకు

వచ్చిన పెద్దలు ప్రారంభిస్తూ.

"ఆడికి గెడ్డి కావాల్సొస్తే నా దగ్గర కొచ్చి ఓపెన్‌గా అడిగితే ఓ మోపు డెట్టేవోణ్ణి గదా!" అన్నాడు అప్పలరాజు శాంతంగా.

అప్పలరాజు శాంతం చూసి పెద్దలకు కొంచెం ఆశ కలిగింది. "పిచకలాంటోడి మీద అంత కోపమెందు కప్పల్రాజుగారూ! మీరంటే ఆడు బయపడి సస్తన్నాడు," అన్నారు పెద్దలు.

"ఆడి ఒంటిమీద నేను సెయ్యేయ్యను" అని హామీ ఇచ్చి - "ఒరే ఎంకా! గాదె పక్కన పెట్టిన ఆ మూట తీసుకురారా," అనరిచారు అప్పలరాజుగారు.

వచ్చిన పెద్దలు తేలిగ్గా నిట్టూర్చారు.

"జరిగిందానికి ఆడూ బాదపడతన్నా డప్పల్రాజుగారూ - ఫ్రంటు పేజీలో బాక్సు కట్టి చింతిస్తానంటన్నాడు," అన్నారు పెద్దలు.

అంతే - అప్పలరాజు నిప్పులరాజైపోయాడు. "జనా లిప్పుడిప్పుడే ఆ ఎదవ రాసిందంతా మర్సిపోతుంటే మళ్లీ ఈడు బాక్సుకట్టి ఆళ్లకవన్నీ గుర్తుచేస్తాడా! ఆడి సావుకి బాక్ పేజీలో బ్లాకు బోర్డరేసి నేను చింతిస్తానని ఆడికి సెప్పండి," అని రంకెలేశాడు అగ్గిరాజు.

"తప రిప్పుడే గదా ఆణ్ణి క్షమించావన్నా రప్పల్రాజుగారూ - మళ్లీ ఇదేం టప్పల్రాజుగారూ?" అని బ్రతిమాలాడారు పెద్దలు.

"ఆడ్ని నేనేం సెయ్యను. ఆడంతటాడు మర్యాదగ సచ్చిపోతే సొంత కర్సెట్టుకుని నల్ల బోర్డరు పేపరచ్చేయించి ఫ్రీగా పంచిపెడతాను," అని చంటబ్బాయి చావుని తను ఎలా సెలబ్రేట్ చెయ్యదలచుకున్నాడో వివరించి (అయినా చంటబ్బాయి చావు తనకి ఆనందాన్ని కలుగజేయదంటూ) - "ఆడు సావగూడదు. ఆడు బతకాలి. ఆడు బతికి బికారై మూడు సెరువుల నీళ్లు తాగి నా దగ్గరకు రావాలి. అప్పుడు ఆడికి ఇయి నేను దానం చెయ్యాలి - నా కోపం తీరాలి" అంటూ ప్రత్యేకంగా చంటబ్బాయి కోసమని శ్రమపడి దేశమంతా గాలించి సంపాదించిన అష్టవంకర్ల చేతికర్ర, వంద చొట్టల జర్మను సిల్వరు గిన్నె, వెయ్యి కన్నాల గోచీ - మూట విప్పి ఒక్కొక్కటే పరసగా ప్రదర్శించి, మళ్లీ జాగ్రత్తగా మూట కట్టించి గాదె పక్కన పెట్టించి, పెద్దలందర్నీ తరిమేసి, అప్పట్నుంచీ చంటబ్బాయిని కోర్టుల చుట్టూరా తిప్పుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాడు

అప్పలరాజు.

"పెద్దప్పల్రాజా? చిన్నప్పల్రాజా?" అనడిగారు అప్పాజీ అంతా విని నవ్వుతూ.

"చిన్నప్పల్రాజే."

"చిన్నప్పల్రాజుకి ఆవేశం ఎక్కువే గాని మనమాటింటాడు. ఆడితో నే సెటిల్మెంటు చేస్తాగాని, మళ్లీ నీ కోడి కుయ్యాలి. అల్లా ఇల్లా గాదు - సెవులు గింగురుమనేలా, అద్దరేత్రేళ కూసినా తెల్లారిపోయిందని జనం కంగారుపడి లేచేలా కూయించాలి," అంటూ చంటబ్బాయికి విషయమంతా చెప్పి, ఏ చెయ్యాలో తెలియజేశారు అప్పాజీ.

"చాలా రుణాల్లో ఉన్నాను అప్పాజీ" - అంతా విని అన్నాడు చంటబ్బాయి జాలిగా.

"ఆ సంగతి నా కొదిలేసి ఈ సంగతి చూడు" అన్నాడు అప్పాజీ.

"ఈ సంగతి నా కొదిలేసి ఆ సంగతి చూడండి," అని హుషారుగా లేచాడు చంటబ్బాయి.

మర్నాడు పట్టణమంతా - 'అభిమానులారా! ఇంక మీ ఆందోళన ఆపండి. మళ్లీ వచ్చేస్తోంది మీ అభిమాన సంచలన పత్రిక *కోడికూత*' అనే వాల్ పోస్టర్లు ప్రత్యక్షమయ్యాయి. రెండో రోజు *'కోడికూత'* సంపుటి 12, సంచిక 6-12 అట్టహాసంగా అన్ని కిళ్లీ కొట్లలోనూ, న్యూస్ స్టాండ్లలోనూ నిజంగా సంచలనం కలిగించింది.

సిగరెట్లు ఎప్పుడూ కాల్చని వాళ్లు ఆ రోజు కిళ్లీకొట్ల దగ్గర నిలబడి సిగరెట్లు కాల్చారు. పాకెట్లు పాకెట్లు కొనే వాళ్లు పొద్దుట్నుంచీ సాయంకాలం దాకా ఒక్కొక్క సిగరెట్టు కొంటూనే ఉన్నారు. కిళ్లీలు వేసుకోనివాళ్లు కిళ్లీలు మేకల్లా నములుతూ అక్కడే నిలబడ్డారు. రాత్రి పదయ్యేసరికి మూడు ముద్రణలు చూసి పత్రికల చరిత్రలో నూతన అధ్యాయాన్ని సృష్టించింది కోడికూత.

ఆ సంచిక మొదటి పేజీ నిండా ఒంటిమీద నూలుపోగు లేని నగ్నసుందరి అన్ని ఒంపుసొంపులు చూపిస్తూ సెక్సీగా నిలబడి ఉంది. ఆ బొమ్మ కింద ఎర్ర అక్షరాల్లో - "నిజం చెప్పండి - ఈ బొమ్మ రెండోసారి చూడని మగవాడెవడైనా ఉన్నాడా?" అని ప్రశ్నించి అలాంటి వారికి లక్ష రూపాయల బహుమానం ప్రకటించింది. మధ్య పేజీల్లో సెక్సు వ్యక్తి

జీవితంలోనూ, సమాజంలోనూ ఎటువంటి పాత్ర నిర్వహిస్తున్నదీ, వాత్స్యాయనుడి దగ్గరనుంచి డా.సమరం దాకా ఎవరు ఏం చెప్పినదీ ఓ వ్యాసం వుంది. చివరి పేజీల్లో 'పిచ్చయ్య ఉదంతం' వచ్చే సంచికలో చూడమని పాఠకుల నర్థించింది.

"ఈడికి సొమ్మిచ్చింది బూతు బొమ్మలేసి అమ్ముకోడానికా?" అని చిర్రు బుర్రు లాడారు కోటయ్యగారు.

"ఆడి ఫీల్డు ఆడిది. ఎట్నుంచి వీలుపడితే అట్నుంచి నరుక్కొస్తాడు. సూస్తావుందు - అసాధ్యుడు," అని చంటబ్బాయిని మెచ్చుకుంటూ ఉండగా ఈల వేస్తూ హుషారుగా వచ్చేశాడు కోడికూత ఎడిటరు.

"ఏరా చంటబ్బాయ్! బొమ్మ రెండోసారి సూళ్లేదంటే లక్ష ఇచ్చేస్తావేంట్రా?" అన్నాడు అప్పాజీ పరిహాసంగా.

"సరిగా చదవండి అప్పాజీ! రెండోసారి చూడని మగాడికే లక్ష రూపాయలు! రెండోసారి చూడనివాడు మగాడు కాదంటే పోలా?" అన్నాడు అసాధ్యుడు నవ్వుతూ.

"ఓర్నీ అసాధ్యం కూలా!" అని నాలిక కర్చుకుని - "నేను మాత్రం పావుగంట పరిశీలనగా సూశాన్లే," అని సర్దుకుని నవ్వాడు అప్పాజీ.

రెండోరోజు 'పిచ్చయ్యగారి చర్యని ఖండిస్తున్నాం' అని, బామ్మర్దిగారు అమాయకురాలైన ఆడపిల్లని వేధించడం తప్పని, ఆయన చావుదెబ్బలు తిన్నందుకు విచారం ప్రకటిస్తున్నా, ఆయన చర్యల్ని ఖండించక తప్పదంది కోడి. మూడో రోజు ఈ కేసు పైకి కనిపించేటంత స్పష్టంగా లేదని, దీని లోతుపాతులు చూడడానికి ఓ పరిశోధక బృందాన్ని నియమిస్తున్నామని తెలియజేసింది. నాలుగో రోజు పాలిటిక్సుకి ఆమడ దూరంలో ఉండే డాక్టరు రావు రాజకీయాల్లో దిగాలని నిర్ణయం ఎప్పుడు తీసుకున్నారు? కోటయ్యగారి మీద పోటీ చెయ్యడానికి వ్యక్తిగత కారణం ఏదైనా ఉందా? అని ప్రశ్నించి, సమాధానం కోసం వచ్చే సంచిక తప్పక రిజర్వు చేసుకోమని పాఠకుల నర్థించింది. అయిదో రోజు డాక్టరుగారి చెల్లెలు మూడు నెలల క్రితం హఠాత్తుగా అమెరికా ఎందుకు వెళ్లవలసి వచ్చింది? దాని తరువాతే కోటయ్యగారి మీద డాక్టరు రావుగారు ఎందుకు పోటీ చేశారు? బామ్మర్దిగార్ని తన్నించాల్సిన అవసరం ఎవరికుంది? అని ప్రశ్నలు వేసి సమాధానాలు పాఠకుల ఊహకే వదిలేసింది.

ఆ సరికి నియోజకవర్గమంతా కథ రసవత్తరంగా చిలవలు పలవలుగా

వ్యాపించింది. డాక్టరు చెల్లికి, బామ్మర్దికి సంబంధం ఉందనీ, అందుకనే ఆ అమ్మాయిని అమెరికాలో ఉన్న భర్త దగ్గరకు హఠాత్తుగా పంపించేసి, ఆవేశం తీరక బామ్మర్ది 'వీక్నెస్' కనిపెట్టి, ఎరేసి ఆయన్ను హత్య చేయించాలని కుట్ర పన్నారని కథ ప్రచారంలోకి వచ్చింది.

"ఆడదంటే కరెంటండీ మాస్టారూ - కరెంటు, అలాగే లాగేస్తుంది. పాపం కుర్రాడు పిచ్చయ్యేం చేస్తాడు? మొన్న మన హెడ్మాస్టరు గోడ మీద జయప్రద వాల్ పోస్టరు కేసే చూస్తూ తూంకాలవలో పడిపోలే? లేవదీస్తే - 'కళ్ల గ్లాసులు మార్చాలండీ! కనబడ్డం లేదండీ' అంటూ రాగాలు తీశాడు. కళ్లు కనిపించనివాడు కింద జాగ్రత్తగా చూసుకుంటూ నడవాలి కాని ముసలి గుర్రెలా మోర పైకెత్తి గోడలకేసి చూస్తూ నడవటం ఎందుకంట? ఆయన వయసేవిటి? ఆ తూంకాలవలో పడ్డవేమిటి? అంటే సమాధానం ఉండదు సార్? ఆడదంటే కరెంటండీ మాస్టారూ," అని ఓ సైన్సు మాస్టారు ఓ తెలుగు మాస్టారికి కరెంటు ప్రభావం వివరించారు.

"అంతేలెండి! వెయ్యేళ్లు ముక్కు మూసుకు తపస్సు చేసి పాదాలదాకా గడ్డాలు పెంచేసిన ముండాకొడుకులు, ఆ రంభో, ఊర్వశో ఛస్తే దానికోసం ఛావలే?" అని కరెంటు ఆ కాలంలో కూడా మహర్షుల్నీ, దేవుళ్లనీ కూడా ఎలా తగులుకుందో సోదాహరణంగా తెలుగు మాస్టారు సైన్సు మాస్టారికి తిరిగి చెప్పారు.

"అయినా పెళ్లయింది - దీనికి బుద్ధుండక్కర్లేదా?" అన్నారు జనం.

కోడికూతలు విని ఒళ్లు మండిన రావు డాక్టరు చంటబ్బాయిని జోడుగుళ్ల తుపాకీతో కాల్చిపడేస్తానని (మోస్ట్ టాక్ట్‌లెస్‌గా) పబ్లిక్ మీటింగులో అరిచాడు.

"స్వేచింగ్టన్, స్వేఛ్ఛోవస్కీ, స్వేచింగ్ చాంగ్ మొదలైన మహానుభావులు పత్రికా స్వేచ్ఛ గురించి రాజీలేని పోరాటం సాగించి బలైపోయారని, వారి అడుగుజాడల్లో నడిచే అవకాశం తనకు కలగడం తన అదృష్ట"మని కోడికూత ఎడిటరుగారు ప్రకటించి, ఈ కేసు తమ లాయర్ల చేతిలో ఉంచుతున్నామనీ, రావు డాక్టరు బెదిరింపులకు కోడి బెదరదనీ, ఓ కోడి గొంతు మూగపోతే వెయ్యి కోళ్లు కూస్తాయనీ హెచ్చరించారు.

"పోలు శాస్తుర్లూ! నువ్వేమంటావ్?" అన్నాడు అప్పాజీ నియోజక

పర్గంలో పరిస్థితి అంతా రివ్యూ చేస్తూ.

హాలులో ఓ మూల కంప్యూటరుముందు ఫుల్‌సూటు వేసుకుని కూర్చున్న సెఫాలజిస్టు పూజారి జంధ్యం సవరించినట్లు ఓసారి టై సవరించి, కంప్యూటరుకేసి తిరిగి నమస్కరించి దానితో మాట్లాడడం మొదలుపెట్టాడు.

పోలు శాస్త్రిలూ, కంప్యూటరూ మాట్లాడుకుంటుంటే చూస్తున్న కోటయ్యమంత్రిగారికి ఏం బోధపడక - "ఏం టంటది శాస్తుర్లూ?" అనడిగారు.

"సిక్స్‌టీ - ఫార్టీ" అన్నాడు పోలు శాస్త్రిలు - కోటయ్యగారికి అరవై, రావు డాక్టరుకి నలభై పాయింట్లు ఇస్తూ.

"గుడ్" అన్నారు కోటయ్యగారు.

"నో గుడ్" అని మందలించి, 'స్మాల్ స్నేక్ - బిగ్ స్టిక్' - 'చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి' అని సలహా ఇచ్చింది కంప్యూటరు.

"హా.. హా?" అనడిగాడు పోలు శాస్త్రిలు.

"డెడ్ బఫేలో.. బిగ్ ఐస్."

"చచ్చిన గేదె కళ్లు చేరెడేసి, అంటోంది కంప్యూటరు" అని వివరించాడు పోలు శాస్త్రిలు.

"ఇప్పుడు సచ్చే గేదేపుంది?" అన్నారు కోటయ్యగారు దిగులుగా.

"పిచ్చయ్యగాడున్నాడుగా," అన్నారు అప్పాజీ.

"ఆడు సస్తాడంటారా?" కళ్లు మిలమిలలాడుతుండగా ఆశగా అడిగారు కోటయ్యగారు.

ఇంతలో మేడమీద పిచ్చయ్యగారి గది సర్దుతున్న కోటయ్య మంత్రిగారి భార్యకు డ్రెస్సింగ్ టేబుల్లో మరదలు పిల్ల ఇచ్చిన పంద రూపాయల నోటు కనిపించింది.

"ఇదేంటి - దీని మీద ఏదో రాసుంది?" అంటూ కోటయ్యగారి కిచ్చింది. ఆయన అప్పాజీకి చూపించారు. అప్పాజీ గడ్డం నిమురుకుంటూ చూసి చంటబ్బాయి కిచ్చాడు.

"తిరుగులేని సాక్ష్యం" అంటూ మర్నాడు 'కోడికూత' మొదటి

పేజీలో పందరూపాయల నోటు ఫోటో కాపీ వచ్చింది. ఆ రోజు కూడా పత్రిక మూడు ముద్రణలు చూసింది. అంతవరకు డాక్టరు రావుగారికి దీనితో సంబంధం లేదని వాదిస్తున్నవాళ్లు కూడా 'ఏమో' అన్నారు పంద రూపాయల నోటుమీద రాతలు చదివి తెల్లబోయి.

"ఇష్టం లేనిదైతే పంద రూపాయల నోటిస్తే లాగి లెంపకాయ కొడుతుంది కాని రాత్రికి రమ్మని తన్నిస్తుందా - ఇదంతా పెద్ద ప్లాను కాకపోతే," అన్నాడు సైన్సు మాస్టారు తెలుగు మాస్టారితో.

"చంటబ్బాయి ఇలాంటివి రాస్తూనే ఉంటాడు అని నేనూ మొదట సీరియస్‌గా తీసుకోలేదు కాని ఇదంతా పెద్ద స్టోరీయేనండి మాస్టారూ!" అన్నాడు తెలుగు మాస్టారు సైన్సు మాస్టారితో.

"తన చెల్లెల్ని అదుపులో పెట్టక పాపం పిచ్చయ్యని తన్నించడం ఏవిటి - ఒళ్లు పొగరు కాకపోతే," అని మండిపడ్డారు జనం.

"ఊపులో ఊపు పిచ్చయ్యగాడికి అంతిమయాత్ర కూడా ఏర్పాటు చేసేస్తే సరి - సింపతీ ఓటు కూడా పడద్ది," అన్నాడు అప్పాజీ.

"ఆ ఎదవింకా సావలేదుగా?" దిగులుగా అన్నారు కోటయ్యగారు.

"ఆడు సచ్చేదాకా ఆగితే మధ్యంతరెన్నికలొచ్చేస్తాయి గాని బగవంతుడిమీద బారం వేసి మన ఏర్పాట్లు మనం మొదలెడదాం - ఇంక ఎలెక్షన్లు మూడు రోజులే గదా వుంట!" అన్నాడు అప్పాజీ. డాక్టర్లు తెల్లబోయి చూస్తుండగా పిచ్చయ్యగార్ని దండలేసి వార్డులోంచి మోసుకొచ్చి పూలరథంలా అలంకరించిన ట్రాక్టరు మీద పడుకోబెట్టేశారు.

"ప్రముఖ యువజన నాయకులు పిచ్చయ్యగారి మృతి" అంటూ 'కోడికూత' స్పెషల్ ఇస్యూ నల్లబోర్డరుతో వచ్చేసింది. జరిగిన కథ క్లుప్తంగా (అందరికీ తెలిసినదే అయినా) మళ్లీ రాసి అంతిమయాత్రలో అందరూ పాల్గొనాలని అర్థించింది.

పిచ్చయ్యగారి సిద్ధాంతాలూ, పవిత్రత, త్యాగదీక్ష మనందరికీ అనుసరణీయాలు అని యువనాయకు లొకరు ఆవేశంగా ఉపన్యసించారు. మంచి చెడ్డలు అందరిలోనూ ఉంటాయని, మంచిని మాత్రమే చూడగల మంచి మనసును భగవంతుడు ఓటర్లందరికీ ఇవ్వాలని పెద్దలు భగవంతుణ్ణి అర్థించారు. 'పిచ్చయ్య స్కాలర్‌షిప్', 'పిచ్చయ్య మెమోరియల్ మెడికల్ ట్రస్ట్', 'పిచ్చయ్య లిటరరీ ఎవార్డు' లాంటివి అనేకం పిచ్చయ్యగారి స్మృతికి

నివాళులు అర్పిస్తూ అప్పటికప్పుడు వెలిశాయి.

అశేష ప్రజానీకంతో బామ్మర్ది అంతిమయాత్ర మొదలైంది. పెద్దలు 'శవం' వెనుక మౌనంగా ఆవేదనతో నడుస్తుండగా, యువకులు ఆవేశంతో అవతల పార్టీ వాళ్ల ఇళ్లూ, కొట్లూ అంటిస్తుండగా బామ్మర్దిగారి పూలరథం గమ్యస్థానం వేపు సాగిపోయింది.

శ్రీదేవి, రేఖ, జయప్రద లాంటి సుందరీమణులు మల్లె, గులాబీ, సన్నజాజుల దండలేస్తూ పిచ్చయ్య నావాడంటే నావాడని వాదులాడుకుంటూ ఆయనమీద వాలిపోతుంటే, జగదేకవీరుడిలా పూలపానుపుమీద పడుకుని చిరునవ్వుతో విలాసంగా వారి సేవలు అందుకుంటున్నాడు బామ్మర్ది.

అంతలో "హ.. హ్హ.. హ్హ" అని పెద్దపులి నవ్వినట్లు ఓ నవ్వు వినిపించింది. బామ్మర్ది తలతిప్పి చూస్తే మీసాలు దువ్వుతూ భజగోవిందం మీద మీదకు వస్తున్నాడు. "బాబోయ్, ఈడు ఇక్కడకు కూడా వచ్చేసాడు రోయ్!" అని లేచి పారిపోబోతుండగా బామ్మర్దికి తెలివొచ్చింది.

సుందరీమణులు మాయమైపోయినా పూలపానుపు కనుపించి బామ్మర్దికి తను చూస్తున్నది కలో నిజమో అర్థంకాక పక్కన కూర్చుని విలపిస్తున్నాయన్ని అడిగాడు నీరసంగా.

ఆయన పై కండువా ఓసారి పిండి కళ్లు తుడుచుకుని - "అదేంటమ్మా - శ్మశానం వచ్చేస్తుండగా ఇప్పుడిలా లేస్తారేంటి? తప్పు కాదూ! మీరలాగే బజ్జోండి!" అని బామ్మర్దిగార్ని మెత్తగా మందలించి, "మీరు చచ్చిపోయారు, మనం గెల్చిపోతాం" అని సంతోషంతో కళ్లనీళ్లు రాగా, కళ్లు తుడుచుకుని, కండువా పిండి "పోయావా - బామ్మర్దోయ్ - పోయావా!" అని రాగయుక్తంగా మళ్లీ విలపించడం మొదలెట్టారు.

"ఓహో!" అని కళ్లు మూసుకున్న బామ్మర్దిగారికి ఆయన మాటల, ఏడుపుల అర్థం ఓ నిమిషం తరువాత బోధపడి - "బావోయ్ - నేను బతికే ఉన్నాను బావోయ్!" అని ఓపికంతా కూడదీసుకుని ఓ పెనుకేక వేశారు.

"పిచ్చయ్యగారు బ్రతికారు. ధర్మం బ్రతికింది. న్యాయం గెలుస్తుంది. కోటయ్యగారు గెలుస్తారు!" అని జనం ఆనందం పట్టలేక తిరుగు ప్రయాణంలో మరో అరడజను కొంపలంటించేశారు.

కోటయ్య మంత్రిగారు అలాగ ఇలాగ గెలవడం కాదు - థంపింగ్

మెజారిటీతో గెలిచారు. రావు డాక్టరు డిపాజిట్టు పోయింది.

"ఒరే బామ్మర్దీ! మనం నెగ్గేశాంరోయ్" అన్నారు కోటయ్య మంత్రిగారు హాస్పిటల్లో బామ్మర్ది బెడ్ దగ్గరకు నడుస్తూ.

"హో... హో... హీ... హీ..." అని బామ్మర్దిగారు ఏడుపులాంటి నవ్వొకటి నవ్వారు.

"ఒరే ఎదవా! ఇదంతా నీ సలవేరా!" అన్నారు కోటయ్య మంత్రిగారు ఆనందం పట్టలేక బామ్మర్దిని కౌగిలించుకుంటూ.

"హీ... హీ... హో... హో..." అని బామ్మర్ది నవ్వులాంటి ఏడ్పొకటి ఏడ్చి - "అమ్మోయ్!" అన్నాడు ఎముకలు పుటుక్కుమనగా.

"ఒరే చంటబ్బాయ్! ఇంక రావు డాక్టరు మీద రాయకు, పాపం రావు డాక్టరు మంచోడే కాని ఆటేంటో తెల్సుకోకుండా బేడ్మింటను బేటుతో క్రికెట్టాడతాననే పిచ్చోడు! మొహం పగిల్దంటే పగల్దా మరి" - అప్పాజీ ఆ రాత్రి ఎన్నికల్ని సమీక్షిస్తూ మొదలుపెట్టాడు.

"ఆటెల్లాంటిది? కుడి చేత్తో ఓటడిగితే 'ఛీ ఎదవా' అని వోటరు సీపురు తిరగేస్తే ప్లేటు ఫిరాయించి, పార్టీ మార్చి ఎడం చేత్తో అడగాలి. ఆడు వోటు ఏ పార్టీ కేసినా పవర్లో వుండేది మనవే కదా! ఎర్రిమొకం వోటరు, ఆడి కాగితం ముక్కకి గవర్నమెంటడిపోయిందనుకుంటాడు గాని యాక్టర్లు మారినా నాటకం అదేనని ఆడికి తెలీదు.

"ఇంక యాక్టరెల్లాంటోళ్లు? నవరసాలు ఏకకాలంలో కురిపించగల నటసార్వబౌములూ, నటచక్రవర్తులూనూ.

"ఒకడు అమ్మా, బాబూ అని చేతులట్టుకుంటే, ఇంకోడు తమ్ముడూ, సెల్లీ అని కాళ్లట్టుకుంటాడు. ఒకడు బారతమాతంటే ఇంకోడు తెలుగుతల్లంటాడు. ఆడు డెవలెప్మెంటంటే ఈడు కరప్షనంటాడు. ఈడు డెమొక్రసీ అంటే ఆడు సోషలిజం అంటాడు. ఆడు గరీబీ హటావో అంటే ఈడు గాడిద గుడ్డంటాడు.

"ఈపుమీ దెక్కేవో డొకడు, అణ్ణి దింపేసి నెత్తికెక్కుతా ననేవోడు ఇంకొకడు! ఒకడు డాకూ, ఇంకోడు మహా డాకూ! ఇంక వోటరుగాడి బుర్రపోకేం జేస్తది?

"లేకపోతే దేసేన్ని గుప్పెట్లో ఎట్టుకుని, దేసెం కోసం వున్నదంతా

త్యాగం జేసేపనేవోళ్లూ, ఎమర్జెన్సీలో సంజయగాంధీ సెప్పులు మోసి ఇప్పుడు డెమోక్రసీ అని గుండెలు బాదుకునేవోళ్లూ, కోట్లకి పడగలెత్తి కుర్చీలకు పరుగులు తీసే సర్వసంగపరిత్యాగులూ జనాల చేత జేజేలు ఎలా కొట్టించుకుంటన్నారనుకుంటున్నావ్?

"అల్లాంటప్పుడు ఆటలో సత్రకాయలా, టేక్టులేనోడు, యాక్టింగు తెలీనోడు, రావు డాక్టరు ప్రిన్సిపల్సంటూ స్టేజీ ఎక్కితే జనాలు ఈలలేసి, గోలజేసి, రాళ్లిసిరి ఆణ్ణి దింపేసేరంటే దింపరా? డెమోక్రటిక్ సిస్టం గదా!"

"ఇదల్లాటప్పా సిస్టవేంటి? సివరికి రష్యావోడు కూడా ఈ సిస్టం చూసి, ముచ్చటేసి, ఎలెక్షన్లెడదావని సరదా పడతాన్నాడంట. మన గాలి అటు కూడా ఈస్తున్న దన్నమాట!"

అప్పాజీ మాట పూర్తి కాకుండానే ఉత్సాహంగా అన్నారు కోటయ్య మంత్రిగారు - "ఐతే ఈసారి మనం నామినేషను అక్కడేస్తే సరి!"

హాలులో ఉన్న పోలు శాస్త్రిలు ఉలిక్కిపడిలేచి నిలబడి, జుట్టు పీక్కుని, టై రెండు కొసలు చెరోచేత్తోనూ బిగించి లాగి ఉరేసుకోబోయి, అంతలో అటూ ఇటూ చూసి, అందరూ చిరునవ్వుతో కోటయ్య మంత్రిగారి కేసి చూస్తూ గేదెల్లా తలలూపడం గమనించి, తనూ ఓ వెర్రి నవ్వు నవ్వి తల చేత్తో పట్టుకుని కూలబడిపోయారు - "దేవుడా" అంటూ.

*[‘ఆంధ్రప్రభ’ సచిత్రవారపత్రిక, 28-3-1990, సౌజన్యంతో]*

★ ★ ★ ★